సాక్షి
చిత్తూరు

బుధవారం। 13। నవంబర్। 2024



పంటలపై ఏనుగుల దాడులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో సోమవారం రాత్రి పంటలపై దాడులు చేసిన ఏనుగులు, ఆరబెట్టిన వరిధాన్యాన్ని ఆరగించాయి.



పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: సహకార వారోత్సవాల పోస్టర్లను మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆవిష్కరించారు.



న్యూమోనియాను నివారిద్దాం

కాణిపాకం: చలికాలంలో పిల్లలను వెంటాడే న్యూమోనియా వ్యాధి నివారణకు కృషి చేద్దామని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా వారోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : గ్రంథాలయ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 57వ గ్రంథాలయ వారోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించాలని చెప్పారు. తద్వారా గ్రంథాలయ గొప్పదనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అభ్యర్థులు జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం రూ.1 లక్ష లోపు ఉండాలని తెలిపారు. టీటీసీ, టెట్ పూర్తి చేసిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, మెటీరియల్‌కు రూ.1000 అందజేస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన సర్టిఫికెట్లు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు మార్కుల జాబితాలు, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, 3 ఫొటోలు జత చేసి ఈ నెల 15వ తేదీలోపు కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ భవనంలో ఉన్న బీసీ సంక్షేమ శాఖలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 85200 04646, 91774 29494ను సంప్రదించాలని డీడీ కోరారు.

సర్వేపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీపీఓ సాంబశివారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : పరిశ్రమల వార్షిక సర్వేపై అవగాహన ముఖ్యమని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) సాంబశివారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వస్తూత్పత్తి రంగ పరిశ్రమల వాటా అంచనా వేయడంలో అవగాహన ముఖ్యమన్నారు. వస్తు ఉత్పత్తి రంగంలో ఉన్న వ్యవస్థీకృత పరిశ్రమలకు సంబంధించి 2023-24 పరిశ్రమల వార్షిక సర్వే ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. పారిశ్రామిక యూనిట్లు, బీడీ, సిగార్ కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వ బిజినెస్ రిజిస్టర్ లోని వస్తు ఉత్పత్తి రంగ పరిశ్రమలు సర్వే పరిధిలోకి వస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వైఎస్ఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం ఉపసంచాలకులు శ్రీనివాసరావు, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌లు ప్రశాంతి, శ్వేత, గోపాలరావు, కిరణ్ పాల్గొన్నారు.



బాలింతల వార్డు (ఫైల్)

లగ్న జననం!



- ప్రసవానికీ ముహూర్తం
- సమస్యలు తెచ్చుకుంటున్న తల్లీబిడ్డలు
- ఆజ్యంపోస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు
- జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్లు

కాణిపాకం: సిజేరియన్ పేరు చెబితే ఒకప్పుడు గర్భిణులంతా భయపడిపోయేవారు. కానీ ఇప్పుడు అదే పదం మాటిమాటికీ వినిపిస్తోంది. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, గర్భిణి నీరసంగా ఉన్నప్పుడు, ఉమ్మ నీరు పోతున్నప్పుడు తదితర అత్యవసర పరిస్థితుల్లోనే ఇది వరకు సిజేరియన్ చేసేవారు. కానీ ఇప్పుడు అవసరం ఉన్నా, లేకపోయినా కత్తి వాడుతున్నారు. కత్తి గాటు పడనిదే బిడ్డ బయటకు రావడం లేదు. సహజ కాన్పులో వేదన తప్ప కలిగే ప్రయోజనంపై అవగాహన లేకపోవడంతో అంతా ఈ పద్ధతికే ఓటేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో సిజేరియన్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మారుమూల పల్లె వాసులు కూడా సిజేరియన్‌కు వెళ్తుండడం గమనార్హం. జిల్లా కేంద్రమైన చిత్తూరుతో పాటు పలు పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏటా జరుగుతున్న ప్రసవాల్లో సగటున 30 నుంచి 40 శాతం వరకు సిజేరియన్లు ఉంటున్నాయి. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంటోంది.

ఒకప్పుడు బిడ్డ పుట్టిన వెంటనే మావోడు ఏ ముహూర్తంలో పుట్టాడో చెప్పండి అని పండితులు, జ్యోతిష్యుల దగ్గరికి వెళ్లేవాళ్లు. ఇప్పుడు పుట్టకముందే జ్యోతిష్యుడి వద్దకు వెళ్లి డెలివరీకి ముహూర్తం పెట్టండి అని అడుగుతున్నారు. ముహూర్తం చూసుకుని శుభ ఘడియల్లో అమ్మ కడుపులోని బిడ్డను బయటకు తీస్తున్నారు. ఎక్కువ మంది రెండో బిడ్డ ప్రసవానికి ఈ లగ్నం పెడుతున్నారు. తొలి కాన్పు సిజేరియన్ అయితే, రెండో కాన్పు ఎలాగూ సిజేరియనే కదా అని నెలలు నిండక ముందే తేదీ నిర్ణయించేస్తున్నారు. రెండు మూడు రోజుల ముందు, మరి కొందరైతే వారం, పక్షం రోజుల ముందే బిడ్డను బయటకు తెచ్చేస్తున్నారు. ఈ ప్రసవం తరువాత తల్లికి బిడ్డకూ ఎన్నో సమస్యలు ఎదురవుతాయని గుర్తుంచుకోవాలి.

బిడ్డపైన ప్రభావం

- బిడ్డ జననం సహజంగా జరిగితే అది చిన్నారి మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదం చేస్తుంది.
- అసహజ రీతిలో చేసే కత్తిగాట్ల వల్ల తల్లి పడే బాధ బిడ్డపై ప్రభావం చూపుతుంది. కీలకమైన సమయంలో ఆ పరిస్థితి శిశువు స్పందనలపై పడుతుంది. శిశువుల జ్ఞానాత్మక అభివృద్ధిలో తేడాలు అధికంగా చూపుతాయి.
- బిడ్డలో ఆ సమయానికి కొన్ని రకాల హార్మోన్లు అవసరమైన దాని కంటే ఎక్కువగాను లేదా తక్కువగాను విడుదలై అవి భవిష్యత్‌పై ప్రభావం చూపుతాయి.

ఇదీ వ్యాపారమే!

ఒక సిజేరియన్‌కు జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రుల వారు సుమారు రూ.40వేల నుంచి రూ.80 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అంటే ఇది ఓ మేజర్ ఆపరేషన్‌కు తీసుకున్నంత మొత్తంలో ఉంటోంది. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజుకు సగటున 50 నుంచి 90 వరకు వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. వీటిలో 80 శాతం వరకు సిజేరియన్ కేసులే ఉంటాయి. సిజేరియన్ చేస్తే ఆస్పత్రిలో ఆరు నుంచి 8 రోజుల వరకు ఉండాలి. ఖర్చు కూడా ఎక్కువే. సహజ ప్రసవానికి రూ.20 వేలు లోపు ఖర్చు అవుతోంది. తల్లీ బిడ్డా రెండు రోజుల్లో ఇంటికి వెళ్లిపోవచ్చును.

ముహూర్తం పెట్టుకుని మరీ

సిజేరియన్లపై జిల్లావాసులు ఎంతగా మక్కువ చూపుతున్నారంటే.. ఆపరేషన్లకు ముందుగానే ముహూర్తం పెట్టుకుని మరీ వస్తున్నారు. అంటే ప్రసవానికి ముందే వారు సిజేరియన్ చేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. వారే అలా సిద్ధమయ్యే సరికి డాక్టర్లదేముంది. ఎలాగూ డబ్బులు వస్తాయి కదా అని వారికి అవగాహన కల్పించకుండా ఆపరేషన్ చేయడానికి సిద్ధమైపోతున్నారు. కొందరు డాక్టర్లు చెప్పే ప్రయత్నం చేస్తున్నా జనం మాత్రం వినిపించుకోకపోవడం విడ్డూరం.

ముహూర్తాల వెర్రి

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్న వారిలో చాలామంది ముహూర్తాలను చూసుకునే నిర్ణయాలు తీసుకుంటున్నారు. దాదాపు 30 నుంచి 40 శాతం మంది తిథి, ఘడియలు, నక్షత్రాలు చూసుకుని ఆస్పత్రులకు వెళుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రసవానికి ఇంకా సమయమున్నా ముహూర్తాల వెర్రిలో పడి వారం, పదిరోజుల ముందే ఆపరేషన్‌కు సిద్ధమవడం కరెక్టు కాదని పెద్దలు సూచిస్తున్నారు. ఎందుకంటే బిడ్డ తల్లి కడుపులో తొమ్మిది నెలలు నిండేవరకు ఉంటేనే ఆరోగ్యంగా ఉంటుంది. రెండు, మూడు రోజుల వ్యవధిలో చేసినా ఏం కాదుగానీ, పది, పదిహేనురోజుల తేడాతో బిడ్డను బయటికి తీస్తే అనేక సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

పండుగల్లో ప్రత్యేకం

శ్రావణమాసం, మాఘమాసం, కార్తీక మాసం, రంజాన్ మాసం, క్రిస్మస్ పండుగ రోజులలో డెలివరీల సందడి కనిపిస్తోంది. మంచి రోజులు వస్తాయంటే ఒకపక్క పెళ్లిళ్ల సందడి ఉండగా, మరోపక్క ఈ సమయంలోనే బిడ్డ పుడితే జాతకంతోపాటు భవిష్యత్తు బంగారంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

సిజేరియన్‌తో ఇబ్బందులు

- సహజ ప్రసవ సమయంలో ప్రొలాక్టిన్ వంటి హార్మోన్లు విడుదల కావడం వల్ల బాలింతలో సహజంగానే చనుబాలు ఉత్పత్తి అవుతాయి. అదే సిజేరియన్ అయితే పిల్లలు పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం కష్టమవుతుంది.
- ముర్రుపాలు పట్టకపోతే అది బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.
- సిజేరియన్ సమయంలో గర్భిణి మూత్రనాళానికి, పేగులకు గాయాలయ్యే అవకాశం ఉంటుంది.
- శస్త్ర చికిత్స జరిగితే నొప్పితో బాలింతలు నెలల తరబడి మంచానికి పరిమితం కావాల్సి వస్తుంది.
- కదలికలు తక్కువ కావడం వల్ల హెర్నియా వంటి సమ్యలు వస్తాయి.
- పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం వంటివి చోటు చేసుకుంటాయి.

కారణాలు ఎన్నెన్నో..

- ఆహారపు అలవాట్లలో మార్పు రావడం, వ్యాయామ లేమి, బయటి తిళ్లు ఎక్కువగా తీసుకోవడం వంటివి సైతం గర్భిణుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.
- రక్తపోటు, చక్కెర శాతం పెరగడం, థైరాయిడ్ వంటి అనారోగ్య ఇబ్బందులు వస్తున్నాయి. ఇలాంటి లక్షణాలు ఉండే మహిళలకు సిజేరియన్ చేస్తున్నారు.



గర్భిణులకు సేవలందిస్తున్న వైద్యులు(ఫైల్)

సిజేరియన్ ఎప్పుడు చేస్తారంటే..

- గర్భిణికి రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు
- గర్భంలో బిడ్డ అడ్డం తిరగడం
- గర్భాశయ ముఖ ద్వారాన్ని మాయ కమ్మేయడం వంటి అత్యవసర సమయాల్లో సిజేరియన్లు చేస్తారు.
- తల్లి ప్రాణాలకు ముప్పు ఉన్న పరిస్థితుల్లో సిజేరియన్ చేస్తారు.

అది భగవంతుడి నిర్ణయం



“పుట్టుక అనేది భగవంతుడు నిర్ణయించింది. ఆ సమ యంలోనే జననం జరగాలి. డెలివరీ డేట్లు ఒక రోజు అటు, ఇటు ముహూర్తం అడుగుతున్నారు. వారం, తిథి, నక్షత్రం, తారాబలం, లగ్న బలం చూసుకున్న తర్వాతనే కాన్పుకెళుతున్నారు. రెండు, మూడు ఏళ్ల కిందట అంతగా లేకపోయినా, ప్రస్తుతం మంచిరోజు చూసుకునే సిజేరియన్ చేసుకుంటున్నారు.

– సుధాకర్ గురుక్కల్, అర్చకులు, చిత్తూరు

కడుపు కోత మంచిది కాదు



చాలా మంది ముహూర్తం పెట్టి సిజేరియన్‌కు సిద్ధమవుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. బిడ్డను ఆ సమయంలోనే ఆపరేషన్ చేసి తీయాలని చెప్పడం కరెక్ట్ కాదు. దీని వల్ల తల్లీ బిడ్డకు ప్రమాదం. సిజేరియన్ అనేది అత్యవసరమైతేనే చేయాలి. అది కూడా సమయాన్ని బట్టి సిజేరియన్ చేస్తాం. సిజేరియన్ విషయంలో వైద్యులపై ఒత్తిడి తేరాదు.

– ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

సుఖ ప్రసవానికి ప్రాధాన్యత



ప్రభుత్వాలు సుఖ ప్రసవాల సంఖ్యను పెంచాలని పదే పదే చెబుతున్నాయి. ఆ రకంగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంఖ్యను పెంచేలా చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లకే పరిమితం చేశారని ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. కచ్చితంగా ఇలాంటి వాటిని ప్రోత్సాహించం. అన్ని చోట్లా తనిఖీలు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

ఇక సమస్యలపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు: ఇన్నాళ్లూ ఎన్నికలు ఆపై కొత్త ప్రభుత్వం ఏర్పాటు, అధికారుల బదిలీలతో ఇబ్బందులున్నందున, ఇకపై రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్లు దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ఆ మేరకు పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్లలోని ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, డీటీలతో స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ రీసర్వేలో తలెత్తిన ఇబ్బందులను, ఆర్‌డీవో కార్యాలయాల్లో పెండింగ్ ఫిర్యాదులను వారానికి పది చొప్పున పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కోర్టు కేసుల విషయంలో ఆలస్యం చేయరాదన్నారు. ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన ఎల్‌పీఎం ఫిర్యాదుల పరిష్కారానికి మూడునెలల షెడ్యూల్ తయారు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో పలమనేరు, కుప్పం ఆర్‌డీవోలు భవాని, మోహన్‌కుమార్, డీఎస్‌వో శంకర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

సీఐ బదిలీతో పోలీసు శాఖకు గుబులు

- అధికార పార్టీకి తలొగ్గినా తప్పని వేటు
- ఐదు నెలల్లోనే మళ్లీ వీఆర్‌కు సీఐ
- ఆందోళనలో కుప్పం పోలీసులు



బాధ్యతలు స్వీకరిస్తున్న జీటీ నాయుడు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నాయకులు చెప్పింది చెప్పినట్లు చేసినా కుప్పం అర్బన్ సీఐని వీఆర్‌కు పంపించడంతో పోలీసు శాఖలో వణుకు పుడుతోంది. రెండు రోజుల క్రితం అర్బన్ సీఐ జీటీ నాయుడిని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతోపాటు అనంతపురం డీఐజీ కార్యాలయాన్ని సరెండర్ చేసినట్లు సమాచారం. కూటమి అధికారంలోకి రాగానే కుప్పం టీడీపీ నేతలు అనంతపురంలో పనిచేస్తున్న జీటీ నాయుడును కోరి మరీ తెచ్చుకున్నారు. ఆయన రాకతో కుప్పంలో ప్రతిపక్ష పార్టీ నేతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేరుగా సీఐ హోదా మరచిపోయి టీడీపీ నేత మారిపోయి వైఎస్సార్ సీపీ నేతలను ముప్పుతిప్పలు పెట్టారు. కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరేలా ఒత్తిడి చేశారు. దీంతో ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. కుప్పం అర్బన్ స్టేషన్ పరిధిలో 14 అక్రమ కేసులను వైఎస్సార్‌సీపీ నేతలపై బనాయించారు. పక్క రాష్ట్రాల్లో వ్యాపార నిమిత్తం వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులను పట్టుకువచ్చి అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ నుంచి కుప్పం స్టేషన్‌కు వైఎస్సార్ సీపీ నేతలు వస్తున్నారని సమాచారం తెలుసుకుని కుప్పం స్టేషన్‌కు వచ్చిన వైఎస్సార్ సీపీ నేతలపై లాఠీచార్జి చేసి ప్రతాపం చూపించారు.

టీడీపీ నేతలతో విభేదాలు

టీడీపీ నేతలు చెప్పిందంతా చేసినా విభేదాలు సైతం ఆయన్ను వెంటాడాయి. మున్సిపాలిటీ పరిధిలో ఓ సంఘటన టీడీపీ నేతలకు పోలీసుల మధ్య విభేదాలను తెచ్చిపెట్టింది. పెళ్లై ఇద్దరు బిడ్డల తల్లిని ప్రేమించిన యువకుడి వ్యవహారం వారం క్రితం పోలీసు స్టేషన్‌లో దుమారమైంది. ఈ విషయంపై సీఐ దురుసుగా ప్రవర్తించారని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. ప్రైవేట్ ఫిర్యాదుకు నూలకుంట పంచాయతీకి చెందిన టీడీపీ నేత వద్ద నుంచి భారీగా వసూలు చేసినట్లు సమాచారం. కొత్తపేటలో దుకాణాలు సమయానికి మూసివేయలేదని పోలీసులు చితకబాదారు. దీంతోపాటు పట్టణంలో వసూళ్ల విషయంలో టీడీపీ నేతలు, సీఐ మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి.

కుప్పంలో పనిచేయలేం

అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించిన కుప్పం అర్బన్ సీఐ వీఆర్‌కు వెళ్లడంతో కుప్పం పోలీసుల్లో గుబులు పుట్టింది. ఐదు నెలలపాటు అర్బన్ స్టేషన్‌లో పని చేసిన సీఐని అకస్మాత్తుగా వీఆర్‌కు పంపటంతో షాక్ అయ్యారు. టీడీపీ నాయకులు చెప్పింది చెప్పినట్లు చేసినా వీఆర్‌కు పంపించారంటే.. అసలు ఎలా వ్యవహరించాలో అంతుపట్టడం లేదని చర్చించుకుంటున్నారు. దీంతో పోలీసులు కుప్పం నియోజకవర్గంలో పనిచేయలేమని అధికార పార్టీ నేతల వేధింపులు భరించలేమంటూ స్వ చ్ఛందంగా బదిలీకి సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

జగనన్న మనిషి విజయ్

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- కూటమి వాగ్దానాల అమలుకు పోరాడదాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి, పక్కన నారాయణస్వామి, విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మనిషి విజయ్ (విజయానందరెడ్డి) నాయకత్వంలో నియోజకవర్గ శ్రేణులు ముందుకు వెళ్లాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చిత్తూరు నియోజకవర్గ పార్టీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని చెప్పారు. అదే వైఎస్ జగన్, కుటుంబంపై పోస్టులు పెట్టినవారిని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తిరగబడితే తొక్కిపడేస్తామని పోలీసుల ద్వారా ప్రభుత్వం సంకేతం ఇస్తోందని వివరించారు. జగన్ పేదల వైపు ఉంటే చంద్రబాబు బడాబాబుల వైపు ఉంటారని చెప్పారు. మనం కష్ట సమయంలో ఉన్నాం ఇప్పుడు పోరాడే వీరులుగా అందరూ సిద్ధమవుదామన్నారు. కూటమి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఆ ఆలోచనలను ఒకటిగా చేసి ఏకతాటిపై తెద్దామని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీకి 11 నియోజకవర్గాల్లో పూర్వవైభవం తీసుకువస్తానని పేర్కొన్నారు. చిత్తూరు తనకు కొత్తకాదని 1974లోనే ఇక్కడ ఉద్యమాలు చేశానని గుర్తు చేశారు. జిల్లాపై సమగ్ర అవగాహన ఉందని అందరినీ కలుపుకొని పనిచేస్తానన్నారు. చిత్తూరువాసులకు విజయానందరెడ్డి ఎన్నో సేవలు చేశారన్నారు.

బడ్జెట్‌లో హామీల ప్రస్తావనేదీ?

బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల ప్రస్తావన లేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దుయ్యబట్టారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారం తాత్కాలికమే.. కానీ ఖాకీలు పదవీ విరమణ అయ్యేవరకు డ్యూటీ చేయాలన్న విషయం గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. చిత్తూరులో విజయానందరెడ్డి, తిరుపతిలో కరుణాకరరెడ్డి ఓటమి ఊహించలేదన్నారు. పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు రూ.3.5 లక్షల కోట్లు జగనన్న అందజేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘోరాలు చూసి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హోంమంత్రిని విమర్శించిన తీరు వారి చేతకాని పాలనకు అద్దం పడుతోందన్నారు. చేతకాని చంద్రబాబును సమర్థవంతుడిగా ఎల్లోమీడియా చూపిస్తోందని దుయ్యబట్టారు.

భూమనతో పార్టీకి పూర్వ వైభవం

పోరాట నాయకుడు భూమన కరుణాకరరెడ్డి పార్టీకి పూర్వవైభవం తెస్తారనే నమ్మకం ఉందని చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అందరిలో మనోధైర్యం నింపి కార్యకర్తల నిస్తేజం పోవడానికి ఆయనకు అధిష్టానం బాధ్యతలు అప్పగించిందన్నారు. ఆయన్ను చూసి ఎంతో స్ఫూర్తి పొందానని చెప్పారు. గత ఎన్నికల్లో ఏమి అన్యాయం జరిగిందో తెలియదు కానీ ఓడిపోయామన్నారు. దళిత, మైనారిటీ వర్గాలకు జగనన్న డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. అమలుకానీ హామీలిచ్చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. వాటి అమలు కోసం పోరాటాలు చేద్దామన్నారు. కార్యకర్తలకు కష్టం వస్తే అందరం స్పందిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నాయకులు, ప్రజాప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, జ్ఞానజగదీష్, టిమ్ము, గాయత్రీదేవి, రాహుల్‌రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, లీనారెడ్డి, కేపీశ్రీధర్, ఆను, ప్రసాద్‌రెడ్డి, బాబునాయుడు, మధుసూదన్‌రాయల్, ప్రకాష్, రజనీ, అమర్‌నాథరెడ్డి, హరిణిరెడ్డి, భాగ్యలక్ష్మి, అంజలిరెడ్డి, సంపత్, సరళామేరీ పాల్గొన్నారు.